ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్‌కు నూతన శోభ

- మారుతున్న రూపురేఖలు
- కొత్తగా ప్లాట్‌ఫామ్స్, బెడ్ల నిర్మాణం

ఆత్మకూరు: స్థానిక ఆర్టీసీ బస్టాండు నూతన శోభ సంతరించుకుంటోంది. గతంలో వర్షాకాలం వచ్చిందంటే చాలు స్వల్ప వర్షం కురిసినా ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణమంతా మోకాళ్లపైగా నీరు నిల్వ ఉంటూ.. ప్రయాణికులు వెళ్లాలంటేనే అసహ్యించుకునే పరిస్థితి ఉండేది. పదేళ్లగా ప్రయాణికులు ఈ అవస్థలు పడుతున్నా గత పాలకులు పట్టించుకోలేదు. సమస్యను ఆర్టీసీ సిబ్బంది, అధికారులు, ప్రయాణికులు స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రభుత్వంతో మాట్లాడి బస్టాండులోని సమస్యలను పరిష్కరించేందుకు ఆత్మకూరు ఆర్టీసీ డిపోకు రూ.1.10 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.


వర్షాకాలం వర్షపునీటితో నిండిన బస్టాండ్(ఫైల్)


నూతనంగా ఏర్పాటు చేస్తున్న సిమెంట్‌బెడ్లు

ఇది కదా అభివృద్ధి

దాదాపు పూర్తయిన ప్లాట్‌ఫామ్స్, సీసీ బెడ్లు

ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్ లో రాత్రి 8 గంటలు దాటితే దోమలు, చిన్నపాటి వర్షం కురిస్తే మోకాళ్ల లోతు, బురద తదితర సమస్యలతో ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. మహిళా ప్రయాణికులు పడే పాట్లు అంతా ఇంతా కాదు. సరైన మరుగుదొడ్లు కూడా ఉండేవి కావు. కనీసం కూర్చోవడానికి కూడా సరైన బెంచీలు లేకపోవడంతో రేకుల షెడ్డులాంటి బస్టాండ్‌లోనే తడుస్తూ తలదాచుకునే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణకు నిధులు మంజూరు చేయడంతో నాలుగు ప్లాట్ ఫారాలు, బస్టాండ్ ప్రాంగణం ఎత్తు పెంచేందుకు నూతన సీసీ బెడ్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సీసీ బెడ్లు, ప్లాట్‌ఫారాల పనులు పూర్తయ్యాయి.

మరికొన్ని పనులు

బస్టాండ్ రూపురేఖలు మారనున్నాయి, సిమెంట్ బెడ్ల పనులు పూర్తి కాగా ఫ్లాట్‌ఫారాలకు రంగులు, ఎలక్ట్రికల్ పనులు, కాంపౌండ్ పనులు పూర్తి కావాల్సి ఉంది. ఈ పనులు పూర్తయితే ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు సమకూరనున్నాయి.

66 సర్వీసులు, 20 వేలకు పైగా ప్రయాణికులకు సౌకర్యం

ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి 66 బస్ సర్వీసులు తిరగడంతో పాటు ఇతర డిపోలకు చెందిన 50 సర్వీసులకు పైగా ఆత్మకూరు డిపో మీదుగా విజయవాడ, విశాఖపట్నం, శ్రీశైలం, కర్నూలు, బళ్లారి, బెంగళూరు. హైదరాబాద్ లాంటి దూర ప్రాంతాలకు నడుస్తున్నాయి. ఫలితంగా ప్రతి రోజు 20 నుంచి 25 వేల మందికి పైగా ప్రయాణికులు బస్టాండ్‌ను వినియోగించుకుంటున్నారు.


బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు ఏర్పాటు చేసిన బెంచీలు

నల్లమల ఘాట్ ఉండడం వలన ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది కూడా ఆత్మకూరు డిపో వద్దే కనీసం 20 నిమిషాలకు పైగా సేద తీర్చుకునే సౌకర్యం ఉంది. శ్రీశైలం ప్రయాణికులకు ఈ బస్టాండ్ ప్రధాన కేంద్రంగా ఉంది. ప్రస్తుతం నూతన శోభ సంతరించుకోవడంతో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందనున్నాయి.

ఇబ్బందులు తప్పాయి



ఆత్మకూరు బస్టాండ్‌లో వర్షాకాలం వర్షం నీరు, బురదతో లోపలికి వెళ్లాలంటే ఎంతో ఇబ్బందులు పడ్డాం. బస్టాండ్‌లో వర్షాలకు నిలబడే పరిస్థితి లేదు. ప్రస్తుతం అధికారులు నూతన ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయడం వలన ఇకపై ప్రయాణికులకు ఇబ్బందులు ఉండవు. ఆర్టీసీ బస్టాండ్‌ను నూతనంగా తీర్చిదిద్దడం హర్షించదగ్గ విషయం. – అబ్దుల్‌కలాం, ఆత్మకూరు

సీఎంకు కృతజ్ఞతలు



ఆర్టీసీ బస్టాండు ఎంతో ఆధ్వానంగా ఉండేది. ప్రస్తుతం నూతన ఫ్లాట్ ఫారాలు, కొత్తబెడ్లు ఏర్పాటు చేయడంతో ప్రయాణికుల సమస్యలు , ఇబ్బందులు తప్పాయి. ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.
–ఎలిషా, వెంకటాపురం

త్వరలోనే అన్ని పనులు పూర్తి చేస్తాం

రాష్ట్ర ప్రభుత్వం ఆత్మకూరు డిపో అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడంతో డిపోకు కొత్త రూపురేఖలు వచ్చాయి. ఫ్లాట్ ఫారాలతో పాటు నూతన బెడ్ల నిర్మాణం వలన ప్రయాణికులకు ఇబ్బందులు తప్పాయి. ఇంకా ఎలక్ట్రికల్, పెయింట్, ప్రహరి ర్మించాల్సి ఉంది. ఆ పనులు కూడా త్వరలో పూర్తి చేస్తాం.
– మహేంద్రుడు,
ఆర్టీసీ డీఎం, ఆత్మకూరు డిపో

క్లుప్తంగా

నూతన సంవత్సర శుభాకాంక్షలు

నందికొట్కూరు: నందికొట్కూరు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఆయన స్వగృహంలో సాక్షితో మాట్లాడారు. రాజన్న రాజ్యంలో కూలీలు, కార్మికులు, కర్షకులు, రైతులు, ఉద్యోగులు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి

నందికొట్కూరు: రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడారు. 2024 సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆ భగవంతుడిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.

చెత్తను తొలగించేందుకు సహకరించండి


కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు, కో ఆప్షన్‌సభ్యుడు


ఆత్మకూరు: సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులతో ఆదివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కో ఆప్షన్ సభ్యుడు రషీద్ చర్చించారు. వారు మాట్లాడుతూ నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా పట్టణంలో నిల్వ ఉన్న చెత్తను తొలగించేందుకు కార్మికులు సహకరించాలని కోరారు. ఇందుకు కార్మికులు నిరాకరించడంతో ప్రత్యేకంగా కూలీలను నియమించి చెత్తను తొలగిస్తామని, అడ్డుకోవద్దని సూచించారు. ఇందుకు కార్మికులు అంగీకరించడంతో అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తిమోతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

నందికొట్కూరు: శాసన సభ్యులు తొగురు ఆర్థర్ జన్మదిన వేడుకలు ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రమణ, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్లు జాకీర్, ధర్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజు, వనజ, బాలస్వామి, దివాకర్‌రెడ్డి, అయ్యన్న తదితరులు ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు బ్రెడ్లు, పండ్లును, నిరాశ్రయులకు ఫలహారం పంపిణీ చేశారు.

మహానందిలో సండే సందడి


ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

మహానంది: మహానంది ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం నుంచి ప్రారంభమైన స్వామి, అమ్మవార్ల దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి అయ్యప్పదీక్ష స్వాములు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చారు. మహానందీశ్వరస్వామి దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో తమ వాహనాలకు పూజలు చేసుకుని బయల్దేరారు. రాత్రి స్థానిక యాగశాలలో స్వామి,అమ్మవారి ఉత్సవమూర్తులకు ఏకాంతసేవ పూజలు చేపట్టారు.

పథకాలను వినియోగించుకోండి


డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలని ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి తెలిపారు. ఆదివారం మండలంలోని తర్తూరు, తంగడంచ, మండ్లెం గ్రామాల్లో సర్పంచులు పీఎం నాగిరెడ్డి, ఈదుల ఈశ్వర్‌రెడ్డి, కృపమ్మ అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామసభలు నిర్వహించారు. వారు పలు ప్రభుత్వ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వీహెచ్ఏ వెంకటేశ్వర్లు రైతులకు డ్రోన్ ద్వారా పంటలపై రసాయన మందు ఎలా పిచికారీ చేసుకోవాలో ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ గోరీబాయి, కార్యదర్శి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన


పథకాలను వివరిస్తున్న ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను చెంచుగిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బీ రవీంద్రారెడ్డి అన్నారు. ఆదివారం సున్నిపెంటలోని చెంచుగిరిజన కాలనీలో గిరిజనులతో సమావేశమై ప్రధాన మంత్రి జన్‌జాతి, ఆదివాసి న్యాయ మహాభియాన్ పథకం గురించి వివరించారు. అందరికీ పక్కా ఇళ్లు, ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి , గ్రామంలో రహదారుల నిర్మాణం, ప్రతి ఇంటికీ విద్యుత్ సౌకర్యం, నాణ్యమైన విద్య, నైపుణ్య వికాసం, అందరికి ఆరోగ్యం, పౌష్టికాహారం, జీవనోపాధులను మెరుగుపరచడం తదితర అవకాశాలను వివరించారు. గ్రామవలంటీర్లు పథకాలకు సంబంధించి గిరిజనులచే దరఖాస్తులను చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు


కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

జూపాడుబంగ్లా: గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ, యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మండ్లెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఆడుదాం-ఆంధ్ర క్రీడల్లో భాగంగా ఆదివారం మండ్లెం- 1, 2, తర్తూరు గ్రామ సచివాలయాల పరిధిలోని క్రీడాకారుల మధ్య కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీలను హెచ్‌ఎం గిరిధర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పీఈటీ శ్రీనివాసులు, కార్యదర్శి సందీప్, వెల్ఫేర్ అసిస్టెంటు సాయికిరణ్, వలంటీర్లు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న హెచ్చెం గిరిధర్‌రెడ్డి

ఘనంగా పుస్తకావిష్కరణ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని విశ్వనగర్‌లోని గాంధీ దేవాలయంలో సూరన సారస్వత సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ విజయం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. పుస్తక రచయిత డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ విశ్వకర్మ గురించి ప్రత్యేక కథనాలు, పద్యాలు, విశేషాలను పుస్తకంలో వివరించామని చెప్పా రు. అనంతరం విశ్వకర్మ సంఘం నాయకులు ఆమెను ఘనంగా సత్కరించారు. డాక్టర్ సహదేవుడు, డాక్టర్ విశ్వరూపాచారి,గౌరీశంకర్,డాక్టర్ రామేశ్వరరెడ్డి, డాక్టర్ భార్గవరెడ్డి, డాక్టర్ నాగార్జునరెడ్డి, మధుసూదన్‌శర్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

జెన్‌కో కార్మికులను పర్మినెంట్ చేయాలి


తెలంగాణ ఎమ్మెల్యే వంశీకృష్ణకు క్యాలెండర్ అందజేస్తున్న కార్మికులు

శ్రీశైలంప్రాజెక్ట్: తెలంగాణ ప్రాంతంలోని ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని తెలంగాణ రాష్ట్రం అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణకు కార్మికులు ఆదివారం తమ సమస్యలు విన్నవించుకున్నారు. శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల దర్శనార్థం శ్రీశైలం వచ్చిన ఎమ్మెల్యేను సున్నిపెంటలోని ఓ ప్రైవేట్ అతిథి గృహం వద్ద ఏఐటీయూసీ అనుబంధ హెచ్-64 ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కలిశారు. తెలంగాణ జెన్‌కోలో తాము ఎన్నో ఏళ్లుగా కార్మికులుగా పనిచేస్తున్నామని, పర్మినెంట్ చేయించి తమ కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులకు పుష్పగుచ్ఛం , శ్రీశైలదేవస్థానం క్యాలెండర్‌ను అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ బి.లక్ష్మయ్య, కార్మికులు ఎం రామయ్య, సీహెచ్ శ్రీను, ఎస్కే మస్తాన్, బి.శంకర్, కె.విశ్వకుమార్, అబ్దుల్‌ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల భిక్షాటన

ఆత్మకూరు: పట్టణంలో మున్సిపల్ కార్మికులు సమ్మెలో భాగంగా ఆదివారం భిక్షాటన నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు రజాక్, రామ్‌నాయక్, ఏపీ మున్సిపల్ వర్కర్లు, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయ కులు నాగన్న, రాజులు మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నాగన్న, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


నంద్యాల(వ్యవసాయం): స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్ వద్దనున్న ఆయూష్ యోగా కేంద్రంలో ఆదివారం సాయంత్రం యోగా సభ్యులు, చిన్నారులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సమితి నిర్వాహకులు ఆనంద్ గురూజీ మాట్లాడుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ చిన్నారులతో పాటలు, భరత నాట్యం, కోలాటం, శ్లోకాలు, దేశభక్తి గీతాలు తదితర వాటిని నిర్వహించామన్నారు.

'మిల్లీ' సేవలను విస్తరించాలి

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా మిల్లీ కౌన్సిల్ సేవలను విస్తరింపజేయాలని ఆలిండియా మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా ముఫ్తీ అబ్దుల్ ఖదీర్ నిజామీ తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం మిల్లీ కౌన్సిల్ నంద్యాల జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గౌస్, కార్యదర్శిగా సలీమ్ పర్వేజ్ ఎన్నికయ్యారు. జాతీయ కార్యదర్శి హజరత్ రిఫాయి జిలానీ, సహాయ కార్యదర్శి సులేమాన్‌ఖాన్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న తిరుప్పావై ప్రవచనాలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంజీవనగర్ రామాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం 15వ రోజు పాశురాన్ని టీటీడీ బ్రహ్మోత్సవాల వ్యాఖ్యాత డాక్టర్ దీవీ హయగ్రీవాచారి భక్తులకు వివరించారు.



మురిపిస్తున్న వరి

మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో వరి పంట బాగా పండింది. రెండు మండలాల్లో సుమారు 13వేల హెక్టార్ల విస్తీర్ణంలో వరి పంటను రైతులు సాగు చేశారు. ఇప్పటికే సుమారు ఎనభై శాతం వరికోతలు పూర్తయ్యాయి. అక్కడక్కడ మిగిలిన దిగుబడిని రైతులు కల్లాలకు చేర్చి ఆరబోస్తున్నారు. ధర సైతం బాగుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు రెండు మండలాల్లో రైతులు బిజీబిజీ అయ్యారు.

–మహానంది


పెద్దదేవళాపురం వద్ద కుప్పలుగా పోసిన వరి


పెద్దదేవళాపురం పంట పొలాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం


బస్తాల్లో నింపి అమ్మకానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పలు చర్చిల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు హోలీ క్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-1(పెద్దచర్చి) ఆలయ డీనరీ చైర్మన్ జోసెఫ్, పాస్టరేట్-2 ఆల్‌సెయింట్ చర్చి డీనరీ చైర్మన్ ఇమ్మానియేల్ గురువులు తెలిపారు. వారు మాట్లాడుతూ న్యూఇయర్ వేడుకల్లో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయన్నారు. అంతేగాకుండా క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని శిశువుకు నామకరణం చేసే రోజుగా ఆనవాయితీ ప్రకారం 1వ తేదీన పలు ఆలయాల్లో దైవ సందేశం ఇస్తామని చెప్పారు.

పండ్లు, పూలు తేవద్దు

ఆత్మకూరు: ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి సోమవారం పట్టణానికి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలకు ఎమ్మెల్యే ఉదయం నుంచి పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఎమ్మెల్యే కు శుభాకాంక్షలు చెప్పేందుకు పుష్పాలు, పుష్పగుచ్ఛాలు, పండ్లు తీసుకురావద్దని సూచించారు. కేవలం నోట్‌పుస్తకాలు, పెన్నులు అందించి శుభాకాంక్షలు తెలపాలని కోరారు.

న్యూఇయర్ వేడుకలకు బంపర్ ఆఫర్లు

ఆత్మకూరు: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పట్టణంలోని ప్రధాన హోటళ్లు, స్వీట్ దుకాణాలు, బేకరీలు బంపర్ ఆఫర్లు ప్రకటించాయి. హోటళ్ల తినుబండారాలు, కేక్‌లు కొంటే స్వీట్‌బాక్సులు, వివిధ రకాల కూల్‌డ్రింక్స్ ఫ్రీ అంటూ ఆఫర్లు ప్రకటించాయి. పూలదుకాణాల వద్ద కూడా ప్రజలు పూలదండలు కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. ఆఫర్ల ఉండడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడి కేక్‌లు, పూల దండలు, స్వీట్లు అత్యధికంగా కొనుగోలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా పట్టణంతో పాటూ పలు గ్రామాల్లో 2023 సంవత్సరానికి గుడ్ బై చెబుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేడుకలు జరుపుకునేందుకు యువకులు, ప్రజాప్రతినిధులు సర్వం సిద్ధం చేసుకున్నారు. పట్టణంలో నూతన సంవత్సరం సందర్భంగా ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉండనున్నారు. పెద్ద ఎత్తున న్యూయర్ బ్యానర్లు రెపరెపలాడుతున్నాయి.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

ఆత్మకూరు: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్స్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్స్ యునియన్ నాయకురాళ్లు ప్రమీల, లక్ష్మీదేవి, పరిమల, సీఐటీయూ నాయకులు రణధీర్, రామ్‌నాయక్, రజాక్ మాట్లాడుతూ హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, ప్రమోషన్లలో రాజకీయాలు జోక్యాలను అరికట్టాలని, 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేయాలన్నారు.